సాక్షి
కర్నూలు
శనివారం । 10 । జూన్ । 2023



నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యకళావేదికపై విశాఖపట్నానికి చెందిన విద్యార్థినులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.



చురుగ్గా విత్తనాల పంపిణీ

డోన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతులకు విత్తనాలను అందజేస్తోంది.



పుణ్యం పంచుతూ..

గోమాతను మొక్కితే ముక్కోటి దేవతల ఆశీర్వాదం లభిస్తుందని హిందువుల విశ్వాసం. ఇంతటి పుణ్యాన్ని ఇచ్చే ఆవుల పాలిట పట్టణాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలు శాపంగా మారుతున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

11 లోపు పాఠశాలలకు రాగిపిండి, బెల్లం



జూమ్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలలకు జూన్ 11వ తేదీలోపు రాగిపిండి, బెల్లంను చేర్చాలని ఎంఈఓలు, హెచ్‌ఎంలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్, పీఆర్ ఎస్ఈతో కలసి శుక్రవారం జూమ్ మీటింగ్ ద్వారా విద్యాశాఖాధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభించిన రోజే విద్యార్థులకు రాగిజావను అందజేయాలన్నారు. 12వ తేదీన పాఠశాలలు తెరవనున్న నేపథ్యంలో అదే రోజు విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలను అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనుల్లో మరమ్మతులకు, విద్యుదీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తరగతి గదులను శుభ్రం చేసి విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు.

సీఎం హామీలకు కార్యరూపం

కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 1వ తేదీన పత్తికొండ సభలో ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చనున్నాయి. పత్తికొండ నియోజకవర్గంలో పలు రోడ్లు, వంతెనల నిర్మాణాలకు సంబంధించి వెంటనే అంచనాలు రూపొందించి పంపాలని సీపీఓ కార్యాలయ వర్గాలు కోరాయని పీఆర్ ఈఈ ఎస్ఈసీ మద్దన్న తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ... తుగ్గలి మండలం మారెళ్ల నుంచి బొందిమడుగుల రోడ్డు (8 కిలోమీటర్లు)కు రూ.3.50 కోట్లు అవసరమవుతాయని, క్రిష్ణగిరి మండలం కోయిలకొండ - కంభాలపాడు రోడ్డు, లోలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్లు, ఇదే మండలం గోకులపాడులో రూ.7.40 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు రూపొందించామన్నారు. ఈ అంచనాలను సీపీఓ కార్యాలయానికి పంపుతున్నట్లు ఈఈ చెప్పారు.

పార్ట్‌టైం టీచర్ల డెమో తాత్కాలిక వాయిదా

కర్నూలు(అర్బన్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ఆంగ్ల మాధ్యమంలో పార్ట్‌టైం టీచర్ల నియామకంలో భాగంగా అర్హులకు ఈ నెల 10న నిర్వహించాల్సిన డెమోను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఈఐ జిల్లా కోఆర్డినేటర్ జీ వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ పోస్టులకు దరఖాస్తులను స్వీకరించామని, డెమో నిర్వహణకు సంబంధించి తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

పశుసంవర్ధక డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అగ్రికల్చర్): రెండేళ్ల పశుసంవర్ధక డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి తిరుపతిలోని వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసినట్లు నంద్యాల జిల్లా కొమ్మెమర్రి వెటర్నరీ పాలిటెక్నికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మెరిట్ ప్రాతిపదికన వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులను ఎంపిక చేసి కళాశాలలకు కేటాయిస్తుందన్నారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 9 నుంచి 23వ తేదీ రాత్రి 12 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు www.svvu.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో డీసెట్ హాల్ టికెట్లు

కర్నూలు సిటీ: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌కి సంబంధించిన డీసెట్ హాల్ టికెట్లు https://cse.ap.gov.in అనే వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న ఆన్‌లైన్‌లో ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఏమైనా ఫిర్యాదులు ఉంటే 9849932289 నంబరుకు ఫోన్ చేయవచ్చునని సూచించారు.

'మద్దతు'తో 7,119 టన్నుల మొక్కజొన్న కొనుగోలు

కర్నూలు(అగ్రికల్చర్): 2022-23 రబీలో పండించిన మొక్కజొన్నను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలుకు ఈ నెల 12 వరకు అవకాశం కల్పించింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 7,119 టన్నుల మొక్కజొన్నను రూ.1,962 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. కర్నూలు జిల్లాలో 255 మంది రైతుల నుంచి 1,619 టన్నులు, నంద్యాల జిల్లాలో 669 మంది రైతుల నుంచి 5,500 టన్నులనును మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయడం కూడా దాదాపు పూర్తి కావచ్చింది.

నాడు నీటి మూట.. నేడు సస్యమైన మాట

నిండుగా కూర్మగిరి చెరువు



వరుణ దేవుడి కరుణకు నోచుకోని భూములు..ఏళ్లుగా బీళ్లు.. చుక్క నీరు లేక కళావిహీనంగా చెరువులు.. గుక్కెడు నీటి కోసం సుదూర ప్రయాణం.. ఇదీ ఒకప్పటి జిల్లా పశ్చిమ ప్రాంత పరిస్థితి. ఇక్కడి ప్రజల బాధలను గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. హామీని విస్మరించి చెరువులకు నీళ్లిచ్చే కార్యక్రమాన్ని అటకెక్కించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏటా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. బీడు భూములు సాగులోకి వచ్చి బంగారు పంటలు పండుతున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ-నీవా నీటితో చెరువులను నింపుతున్నారు. కరువు నేలపై కృష్ణమ్మ పరుగులు పెడుతూ రైతు మోముల్లో ఆనందాన్ని నింపుతోంది.

- టీడీపీ హయాంలో అమలు కాని చెరువులకు నీళ్లిచ్చే కార్యక్రమం
- కేవలం శంకుస్థాపనతోనే సరిపెట్టిన గత ప్రభుత్వం
- రూ.254 కోట్లతో పనులు దాదాపు పూర్తి చేయించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఇప్పటికే 35 చెరువులకు ట్రయల్ రన్ పూర్తి
- ఈ ఏడాది ఆగస్టుకు పూర్తికానున్న మిగిలిన పనులు
- 57 గ్రామాలకు అందనున్న తాగునీరు
- సాగులోకి రానున్న 10,130 ఎకరాలు

కర్నూలు సిటీ: తాము అధికారంలోకి వస్తే హంద్రీ-నీవా కాలువ నుంచి చెరువులకు నీరు నింపి కరువు రక్కసి నుంచి జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని కాపాడుతామని 2009, 2014 ఎన్నికల ప్రచారంలో టీడీపీ నేతలు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేశారు. 2019 ఎన్నికలకు ఏడాది ముందు అంచనాలు వేసి కమీషన్లకు కక్కుర్తి పడి ఎలాంటి భూసేకరణ చేయకుండా, డిజైన్స్‌కు అనుమతులు లేకుండా శంకుస్థాపన చేసి పనులను వదిలేశారు. మొదటగా 108 చెరువులకు నీరు ఇవ్వాలని అనుకున్నా..అనంతరం 68 చెరువులకు కుదించారు. పనులకు రూ. 224 కోట్లతో చేపట్టాల్సి ఉండగా.. టీడీపీ ప్రభుత్వం పైసా బిల్లు చెల్లించలేదు. దీంతో 2019 జనవరిలోనే కాంట్రాక్టర్లు పనులను నిలిపి వేశారు. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే 68 చెరువులకు నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు రూ.254 కోట్లను మంజూరు చేశారు. భూసేకరణ పనులు పూర్తి చేసి, అటవీశాఖ అనుమతులు తీసుకున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పనుల పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్షిస్తూ వచ్చారు. దీంతో 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఆగస్టు మొదటి వారంలో 100 శాతం పనులు పూర్తి చేసి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు.

హంద్రీ-నీవా వైఎస్సార్ పుణ్యమే..

జిల్లాలోని పత్తికొండ, డోన్, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లో రైతులు చాలా మంది వర్షాధారంపై పంటలు సాగు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకుని 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీ-నీవా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ఎత్తిపోతల ద్వారా కృష్ణా జలాలను చిత్తూరు జిల్లా వరకు తీసుకెళ్లేలా నిధులు మంజూరు చేసి పనులు సైతం పూర్తి చేయించారు. 2014 ఎన్నికల కంటే ముందుగానే కాలువకు నీరు విడుదల చేసి అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్‌కు అప్పటి మంత్రులు పాదయాత్ర చేపట్టారు. జిల్లాలో ఏడు ఎత్తిపోతల పథకాలు, రెండు రిజర్వాయర్‌లతోపాటు రెండు చానల్ కాల్వల ద్వారా 80వేల ఎకరాలకు అధికారికంగా సాగునీరు ఇస్తున్నారు. ఇదంతా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పుణ్యమే అని ఇక్కడి ప్రజలు నిత్యం స్మరించుకుంటున్నారు.



చెరువులకు నీరిచ్చే పంపింగ్ స్టేషన్

తండ్రి బాటలో తనయుడు..

హంద్రీ-నీవా ప్రాజెక్టుతో బీడు భూములను వైఎస్సార్ సస్యశ్యామలం చేయిస్తే, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి హంద్రీ-నీవా ప్రధాన కాల్వ నుంచి 68 చెరువులకు నీరు మళ్లించే పనులను పరుగులు పెట్టించారు. కృష్ణగిరి మండలం ఆలంకొండ సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ 90 కి.మీ దగ్గర పంప్‌హౌస్ నిర్మించారు. ఇందులో 3,800 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్ల నుంచి కటారుకొండ పంచాయతీ పరిధిలోని పులిచెర్ల సమీపంలో డెలివరీ చాంబర్ నీరు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి మూడు వైపుల ద్వారా నీరు చెరువులకు మళ్లించనున్నారు. పత్తికొండ నియోజకవర్గంలోని ఐదు మండలాలతోపాటు డోన్, ప్యాపిలి, కల్లూరు, దేవనకొండ మండలాల్లోని 68 చెరువులకు పైపుల ద్వారా నీరు వెళ్లనుంది. పనులు పూర్తయితే 57 గ్రామాలకు తాగునీరు అందనుంది. అలాగే 10,130 ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం కానుంది.



నీటితో తొణికిసలాడుతున్న పెనుమాడ చెరువు

వేసవిలోనూ జలకళ

హంద్రీ- నీవా కాల్వలో నీటి ప్రవాహం ఉన్నంత వరకు 35 చెరువులకు ట్రయల్‌రన్ చేశారు. ఈ నీటితో వేసవి కాలంలోనూ ఈ చెరువులు కళకళలాడుతూ కనిపించాయి. మిగిలిన చెరువులకు నీటిని పంపేందుకు పైపులైన్ పనులు పూర్తయ్యాయి. కేవలం రెండు చెరువుల పనులు మాత్రమే జరుగుతున్నాయి.

నీరందనున్న చెరువులు నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం పేరు	చెరువుల సంఖ్య
డోన్	28
పత్తికొండ	35
ఆలూరు	3
పాణ్యం	2

మూడు గ్రావిటీలు ఇవే..

గ్రావిటీ-1: పులిచెర్ల సమీపంలోని కొండపై ఏర్పాటు చేసిన డెలివరీ చాంబర్ నుంచి 43.40 కి.మీ దూరం వరకు పైపు లైన్‌లో నీరు వెళ్లి డోన్, వెల్దుర్తి, కల్లూరు, కృష్ణగిరి మండలాల్లోని 22 చెరువులకు చేరుతాయి. ఈ నీటి ద్వారా 4217 ఎకరాల భూమి సాగులోకి రానుంది.

గ్రావిటీ-2: డెలివరీ చాంబర్ నుంచి నీరు 29.40 కి.మీ ప్రయాణించి పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ మండలాల్లోని 16 చెరువులకు చేరుతుంది. మొత్తం 3,018 ఎకరాలకు నీరు అందనుంది.

గ్రావిటీ-3: డెలివరీ చాంబర్ నుంచి 26.80 కి.మీ పైపు లైన్ ద్వారా 23 చెరువులకు వెళ్లే నీటితో 2065 ఎకరాలు, జొన్నగిరి బ్రాంచ్ నుంచి 21.10 కి.మీల పైపులైన్ ద్వారా 7 చెరువులకు అందే నీటితో 830 ఎకరాలు ఆయకట్టు అభివృద్ధి కానుంది.

90 శాతం పనులు పూర్తి

జిల్లాలోని 68 చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని అందించేందుకు చేపట్టిన పనులు 90 శాతం పూర్తయ్యాయి. కాల్వలో నీటి ప్రవాహం ఉన్న సమయంలో 35 చెరువులకు నీటిని పంపించేందుకు ట్రయల్‌రన్ పూర్తి చేశాం. కొత్త చెరువు, ఊట చెరువు మినహా మిగిలిన చెరువులకు నీటిని అందించేందుకు పైపులైన్ పనులు పూర్తయ్యాయి. ఈ పనులను సైతం పూర్తి చేసి త్వరలో నీటిని అందించేందుకు సిద్ధం చేస్తున్నాం.

– రెడ్డి శేఖర్ రెడ్డి, జల వనరుల శాఖ

ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత



కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామీజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

కర్నూలు కల్చరల్: హిందూ ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కంచి పీఠం అధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామిజీ పిలుపునిచ్చారు. తన విజయ యాత్రలో భాగంగా శుక్రవారం కర్నూలుకు చేరుకున్నారు. అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కల్లె చంద్రశేఖర్‌శర్మ, హెచ్‌కే రాజశేఖర్, ఏపీ బ్రాహ్మణ సేవా సమాఖ్య కోశాధికారి హెచ్‌కే మనోహర్‌రావులు స్వామీజీకి ఘనంగా స్వాగతం పలికారు. ఓల్డ్‌సిటీ ఖండేరి వీధి శంకర మఠంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఆశీర్వదించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక సేవలో పాలు పంచుకోవాలన్నారు. అంతకు ముందు నగర శివారులోని గోశాలను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. శనివారం ఉదయం పూజా కార్యక్రమాల్లో స్వామిజీ పాల్గొంటారని నగర బ్రాహ్మణ సంఘం నాయకులు వెల్లడించారు.



గోవుకు గ్రాసం తినిపిస్తున్న స్వామీజీ

ఆర్‌బీకేల ద్వారా నాన్ సబ్సిడీ విత్తనాలు


- విత్తన కంపెనీలతో ఏపీసీడ్స్ ఎంఓయూ

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా నాన్ సబ్సిడీ విత్తనాల పంపిణీకి రంగం సిద్ధమైంది. ప్రస్తుతం సబ్సిడీపై వేరుశనగ, కందులు, మినుములు, కొర్రలు, పచ్చిరొట్ట ఎరువులు తదితరాలను పంపిణీ చేస్తున్నారు. అయితే నాన్ సబ్సిడీ విత్తనాలను కూడా ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరి, సజ్జ, మొక్కజొన్న, మిర్చితో పాటు కూరగాయల విత్తనాలు కూడా రైతులకు పంపిణీ చేయనుండటం విశేషం. కొన్ని రకాల విత్తనాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో బ్లాక్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్రాండెడ్ కంపెనీల విత్తనాలను సైతం ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే విత్తన కంపెనీలతో ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ విత్తన కంపెనీలతో ఎంఓయూ కుదుర్చుకుంటోంది. రైతులు ఆర్‌బీకేల్లోని డిజిటల్ కియోస్క్‌ల ద్వారా ఆర్డర్ పెడితే ఏపీసీడ్స్ ఆయా కంపెనీల విత్తనాలను సరఫరా చేస్తుంది.

ఈ ఏడాది మన వాటా 50 టీఎంసీలు

- నీటి లభ్యతను అంచనా వేసిన సీడబ్ల్యూసీ

కర్నూలు సిటీ: తుంగభద్ర జలాశయం నుంచి రాయలసీమ జిల్లాలకు 74 టీఎంసీల నికర జలాల వాటా ఉంది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కి ముందు నీటి లభ్యతను అంచనా వేస్తారు. అనంతరం దమాషా ప్రకారం నీటి కేటాయింపులు చేస్తారు. ఈ ఏడాది రెండు రోజుల క్రితమే బోర్డు సమావేశం ఏర్పాటు చేసి నీటి వాటాల మేరకు కేటాయింపులు చేశారు. తుంగభద్ర డ్యాంకు 2023-24లో నీటి లభ్యత 175 టీఎంసీలు ఉంటుందని అంచనా వేశారు. తుంగభద్ర దిగువ కాలువకు 19.811, కేసీ కాలువకు 8.255, ఆర్డీఎస్‌కు 5.374 టీఎంసీల చొప్పున 50 టీఎంసీల నీటి కేటాయింపులు చేశారు. ఈ నెల చివరిలోపు టీబీ డ్యాంలోకి నీటి చేరికలు ఆశాజనంగా ఉంటాయని, జూలై రెండో వారం నాటికి డ్యాం పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉన్నట్లు సీడబ్ల్యూసీ అంచనా వేసినట్లు జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు.



థ్యాంక్యూ సీఎం సర్

- ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపడంతో ఏపీఎన్‌జీఓల హర్షం
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



థ్యాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎన్‌జీఓ సంఘం నేతలు, ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర కేబినెట్ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, సీపీఎస్‌ను రద్దు చేయడంపై నిర్ణయం తీసుకోవడం, 12వ పీఆర్‌సీ కమిటీ నియామకంపై స్పష్టత ఇవ్వడంతో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ ఎన్‌జీఓ నాయకులతో కలిసి ఉద్యోగులు శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ ప్రాంగణంలో 'థ్యాంక్యూ సీఎం సర్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం గాంధీ విగ్రహం ఎదుట సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌జీఓ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్ బాబు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. 12వ పీఆర్‌సీ కమిటీ నియామకం, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయడం చరిత్రాత్మక నిర్ణయాలని కొనియాడారు. వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 010 పద్దులో జీతాలు చెల్లించేందుకు ఒప్పుకోవడం సంతోషకరమన్నారు. గురుకులాలు, యూనివర్సిటీలు, వివిధ కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడడం హర్షణీయమన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలన్నీ నాలుగు నాలుగు విడతల్లో చెల్లించేందుకు అంగీకారం గొప్ప విషయమన్నారు. జిల్లా కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏను 12 నుంచి 16 శాతానికి పెంచడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ సంఘం పట్టణ అధ్యక్షుడు కాశన్న, నాయకులు బలరామిరెడ్డి, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి పాల్గొన్నారు.

విన్నారు.. పరిష్కరించారు!

- జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి నెల రోజుల్లో 2,617 మంది ఫోన్
- మొత్తం 1,068 మంది సమస్యలకు పరిష్కారం చూపిన అధికారులు
- మిగిలిన 1,549 సమస్యలకు పరిష్కారం చూపే పనిలో యంత్రాంగం
- రోజుకు సరాసరిగా 30 నుంచి 40 మంది వరకు కాల్ సెంటర్‌కు ఫిర్యాదు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రాజెక్టు యూనిట్

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయి. 1902 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేస్తే ఆగమేఘాలపై అధికారులు స్పందిస్తున్నారు. సీఎం కార్యాలయ అధికారుల పర్యవేక్షణ చేస్తుండడంతో ఆలసత్వం వీడుతున్నారు. సమస్యలకు పరిష్కారాలపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి న్యాయం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి నెల రోజుల వ్యవధిలో 2,617 మంది ఫిర్యాదు చేశారు. ఇందులో 1,068 మంది సమస్యలకు సంతృప్తి స్థాయిలో పరిష్కరించగా మిగిలిన 1,549 మంది సమస్యలకు పరిష్కారం చూపే పనిలో అధికారులు ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పేదల సమస్యలు పరిష్కారం కాకుండా మరుగున పడకూడదన్నది ముఖ్యమంత్రి లక్ష్యం. ఈ క్రమంలో ఏకంగా తన కార్యాలయం నుంచే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. దీంతో 1902కాల్ సెంటర్ నుంచి ఫిర్యాదు నమోదైన వెంటనే అధికారులు ఆగమేఘాలపై స్పందిస్తున్నారు. జిల్లాకు సంబంధించి రోజుకు 30 నుంచి 40 సమస్యలపై కాల్ సెంటర్‌కు ఫోన్లు వెళ్తున్నాయి. అత్యధికంగా రెవెన్యూ, పీఆర్, హౌసింగ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, ఏపీఎస్పీడీసీఎల్, పంచాయతీ రాజ్, పోలీసు శాఖలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటున్నాయి.

జిల్లా స్థాయి పర్యవేక్షణకు సీపీఓ ఆధ్వర్యంలో బృందం ఏర్పాటు

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారాలు చూపేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. సీపీఓ అప్పలకొండ ఆధ్వర్యంలో జిల్లా ప్రాజెక్టు యూనిట్‌ను ఏర్పాటు చేశారు. కాల్ సెంటర్‌లో నమోదైన ఫిర్యాదును ఆ రోజే సంబంధిత అధికారి ఓపెన్ చేసి దర్యాప్తు అధికారిని నియమించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజూ స్పందన వెబ్‌సైట్‌ను అధికారులు పరిశీలించేలా చూస్తున్నారు. దీంతో వచ్చిన సమస్యలకు నిర్దేశించిన గడువులోగా పరిష్కారాలు చూపేందుకు అవకాశం ఉంటోంది.

స్పష్టమైన పరిష్కారం లభిస్తుంది

జగనన్నకు చెబుదాం ఫిర్యాదులకు స్పష్టమైన పరిష్కారాలు లభిస్తాయి. స్పందనలో వచ్చే అర్జీలకు అర్జీదారుడి సంతృప్తిని ఒక్కోసారి పరిగణలోకి తీసుకోం. ఇక్కడ మాత్రం అర్జీదారుడి సంతృప్తి కచ్చితంగా అవసరం. ఒకవేళ అధికారులు పరిష్కరించామని చెప్పినా, అర్జీదారుడు సంతృప్తి చెందలేదంటే ఆ సమస్య మరోసారి రీ ఓపెన్ అవుతుంది. ఇక్కడే స్పష్టమైన పరిష్కారానికి నాంది పడుతుంది.

– డాక్టర్ గుమ్మళ్ల సృజన, కలెక్టర్

క్లుప్తంగా

నేడు మరో విడత మొబైల్ రికవరీ మేళా

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో మరో విడత మొబైల్ రికవరీ మేళాకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే బాధితులకు జిల్లా పోలీసు కార్యాలయ మైదానానికి రావాల్సిందిగా సమాచారం పంపారు. వారు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను శనివారం ఉదయం ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా అందించనున్నారు. ఆరు మాసాల వ్యవధిలో రూ.16.05 కోట్లు విలువ చేసే సుమారు 7,154 మొబైళ్లను రికవరీ చేసి రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా మొబైల్ రికవరీలో మొదటి స్థానంలో నిలిచింది. దేశంలోని ఒడిశా, ఉత్తరప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, బిహార్, రాజస్థాన్ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచే కాకుండా సౌదీఅరేబియా నుంచి కూడా మొబైళ్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. మరో విడత సుమారు 600కు పైగా సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. వాటిని జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో నేడు ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా అందజేయనున్నారు.

కేసీ కెనాల్ డీఈఈగా వై.రఘురామిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న వై.రఘురామిరెడ్డి

కర్నూలు సిటీ: కర్నూలు–కడప కాలువ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా వై.రఘురామిరెడ్డి బదిలీపై వచ్చారు. శుక్రవారం ఆయన జల మండలి ఆవరణలోని కేసీ కెనాల్ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈఈగా బాధ్యతలు చేపట్టారు. కార్యాలయం సిబ్బంది ఆయనకు బొకేలు అందజేసి స్వాగతం పలికారు. ఎస్ఆర్‌బీసీ సర్కిల్–1లో డీఈఈగా వై.రఘురామిరెడ్డి బాధ్యతలు నిర్వహించేవారు. జల వనరుల శాఖలో ఇటీవల నిర్వహించిన బదిలీల్లో కేసీ కెనాల్‌కి వచ్చారు. ఈయన మొదటగా 1993లో ఆధునీకీకరణ విభాగంలో జేఈఈగా చేరారు. ఆ తరువాత 1998 నుంచి 2013 వరకు నాణ్యత విభాగంలో పని చేసి, 2013లో డీఈఈగా పదోన్నతి పొందారు. అప్పటి నుంచి 2019 వరకు చిన్ననీటిపారుదల శాఖ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా పని చేసి, 2019లో ఎస్ఆర్‌బీసీకి బదిలీ అయ్యారు. అనంతరం ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

వెబ్‌సైట్‌లో తాత్కాలిక సీనియార్టీ జాబితా

కర్నూలు సిటీ: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న వారి తాత్కాలిక సీనియార్టీ జాబితా rvmssakurnool. blogspot. in లో ఉంచినట్లు సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ డాక్టర్ కే వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే నేటి(శనివారం సాయంత్రం 5 గంటలలోపు)లోపు ఆధారాలతో తెలపాలని పేర్కొన్నారు. బదిలీలు పారదర్శకంగానే జరుగుతాయని, ఎలాంటి వదంతులు నమ్మవద్దని సూచించారు.



కదల్లేని స్థితిలో రోడ్డుపైనే కూలబడిన ఆవు

పుణ్యం పంచుతూ.. పాపం మోస్తూ!

ఆవు కడుపులో 60 కేజీల ప్లాస్టిక్

- కొన్ని నెలలుగా నరకయాతన
- నెలలు నిండకుండానే దూడ జననం
- ఐదు గంటల ఆపరేషన్‌తో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించిన వైద్యులు
- ఇప్పటికీ వైద్యుల పర్యవేక్షణలోనే ఆవు

సాక్షి, కర్నూలు డెస్క్: ప్లాస్టిక్.. మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తోంది. భూమిలో అంత సులువుగా కరిగిపోని ఈ మహమ్మారి వినియోగం మితిమీరుతోంది. ఏమి కొనుగోలు చేసినా మొదటగా అడిగేది కవర్ ఉందా అని.. దీని వల్ల నష్టాలు తెలిసినా, మనిషి జీవితంలో ఇది భాగమైపోయింది. ప్రభుత్వాలు వీటి వల్ల కలిగే పెను ముప్పును ఊహించి నిషేధించినా.. గుట్టుగా వినియోగం సాగుతూనే ఉంది. ప్లాస్టిక్ క్యాన్సర్ కారకమని వైద్యులు, శాస్త్రవేత్తలు నెత్తినోరు కొట్టుకుంటున్నా ప్రజలు మేల్కొని పరిస్థితి. ఇదిలా ఉంటే మూగజీవాలు కూడా వీటి బారిన చేయని తప్పుకు బలవుతున్నాయి. ఆవును సకల దేవతలకు నిలయంగా పూజిస్తాం. ఇంతటి పుణ్యాన్ని ఇచ్చే ఆవు.. మనిషి పెంచిపోషిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని ఆకలికి తాళలేక



దూడకు జన్మనిచ్చినా ఆహారం తినలేని స్థితిలో..

తింటూ మృత్యు ఒడి చేరుతున్నాయి. ప్లాస్టిక్ పాపాన్ని కడుపున మోస్తూ దినదిన గండంగా బతుకీడుస్తున్నాయి. నంద్యాల పట్టణంలో వందల సంఖ్యలో యజమానులు లేని ఆవులు వీధుల్లో తిరుగుతూ, దొరికింది తింటూ జీవనం సాగిస్తున్నాయి.

ఇక్కడే కాదు.. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ తదితర పట్టణాల్లోనూ రోడ్లపై వందల సంఖ్యలో గోవులు తిండికి అలమటిస్తున్నాయి. పల్లెల్లో తినేందుకు కాస్త ఆకులు, అలములు ఎక్కడపడితే అక్కడ దొరుకుతున్నా.. పట్టణాల్లో ఆ పరిస్థితి ఉండటం లేదని తెలిసిందే. కాంక్రీట్ వనాల్లాంటి ఇళ్లలో ప్రజలు ఎవరికి వారు గిరి గీసుకుని బతుకుతున్న రోజులివి. ఇలాంటి పరిస్థితుల్లో గోడలకు అతికించిన పేపర్లను తినడం, చెత్త కుండీలలో కనిపించిన ఆహారంతో కడుపునింపుకున్న ఆవులు.. ఇప్పుడు అదీ కనిపించక ఆకలితో అలమటిస్తున్నాయి.

కదల్లేని స్థితిలో ఆవు

నంద్యాల పట్టణంలో ఓ ఆవు గత కొంత కాలంగా నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితిలో ఇబ్బంది పడుతోంది. వాస్తవానికి ఇది గర్భం దాల్చడంతో ఆ కారణంగానే ఇలా ఉందని అందరూ భావించారు. అయితే గత పది రోజులుగా కనీసం తిండి కూడా తినలేని పరిస్థితికి చేరుకుంది. ''మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత'' బృందం సభ్యులు ఆవు దీనావస్థకు చలించిపోయారు. ఆ మూగజీవి బాధను అర్థం చేసుకొని తమ వంతుగా చికిత్సకు నడంబిగించారు.

ఐదు గంటల పాటు శ్రమించి..

పశువైద్యులు ముందుగా ఆవుకు సర్జరీ చేయాలని భావించినా, ఆరోగ్యం సహకరించడం లేదని తెలిసి.. మూగజీవులను చేరదీస్తున్న చరణ్ సంరక్షణలో ఉంచారు. ఐదు రోజుల పాటు అవసరమైన మందులు ఇచ్చారు. అయితే సాధారణంగా తొమ్మిది నెలలు చూడి కాలం కాగా.. 8 నెలల్లోనే ఆవు దూడకు జన్మనిచ్చింది. నెలలు నిండకుండానే జన్మించిన ఈ దూడ కూడా బలహీనంగా ఉండటంతో వైద్యులు తగిన వైద్యం అందిస్తున్నారు. ఇక ఆవు కడుపులోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు వెద్యులు గత గురువారం ఆపరేషన్‌కు సిద్ధమయ్యారు. ఉదయం 10.30 గంటలకు మొదలైన ఆపరేషన్ మధ్యాహ్నం 3.30 గంటల వరకు కొనసాగింది. నలుగురు వైద్యుల బృందం.. మూగప్రాణుల ప్రేమికులు చరణ్, రాఘవేంద్రతో పాటు మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత బృందం సభ్యులు, గుంటూరు జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్‌రెడ్డి తదితరుల సాయంతో ఎంతో కష్టించి ఆవు కడుపులోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఇలా తొలగించిన వ్యర్థాల బరువు అక్షరాల 60 కిలోలు. మరో ఐదు రోజుల పాటు ఈ ఆవుకు మెరుగైన చికిత్సను అందించేందుకు వైద్యులు నిర్ణయించారు. ఇందుకు అవసరమైన 20 సెలైన్ బాటిళ్లను పట్టణానికి చెందిన ఓ మెడికల్ షాపు అందించడం విశేషం.



ఆవు కడుపు నుంచి తొలగించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ కవర్లలోని వ్యర్థాలే ఆహారం

ఇంట్లో ఎలాంటి వ్యర్థమైనా సరే ప్లాస్టిక్ కవర్‌లో చుట్టిపారేయడం పరిపాటిగా మారింది. కుళ్లిన కూరగాయలు, మిగిలిపోయిన ఆహారం.. ఇలా ఏదైనా కవర్‌లోనే. మున్సిపాలిటీలు చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టినా, ఇంటిని శుభ్రంగా ఉంచుకునే యజమానులు.. ఊరు విషయంలో మాత్రం మనది కాదులే అనే ధోరణితో ఉంటున్నారు. ఎక్కడా గడ్డి దొరకని పరిస్థితుల్లో, ధాన్యం కూడా పెట్టేందుకు ఎవరూ ముందుకు రాని రోజుల్లో కవర్లలో చుట్టిపడేసిన వ్యర్థాలతోనే ఆవులు కడుపు నింపుకుంటున్నాయి. ఇలా కడుపులోకి చేరిన ప్లాస్టిక్ గోమాత ఉనికినే ప్రశ్నార్థకం చేస్తోంది.

1962 టోల్‌ఫ్రీకి కాల్ చేయగానే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూగజీవుల ప్రాణం కాపాడేందుకు గత ఏడాది ఏప్రిల్ నెలలో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథం సేవలను ప్రతిష్టాత్మకంగా అమలులోకి తీసుకొచ్చింది. స్థానికులు 1962 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయగానే 20 నిముషాల్లో అధునాతన సంచార పశు వైద్య వాహనం కోటవీధి బ్రహ్మణ బజారుకు చేరుకుంది. ఆవు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వాహనంలోనే స్థానిక పశువుల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గర్భంతో ఉండటంతో పాటు పొట్టలో ప్లాస్టిక్ వ్యర్థాలున్న విషయాన్ని గుర్తించారు.



వాహనంలో పశువైద్యశాలకు తరలిస్తూ..



గణేష్ నగర్ సమీపంలో ఇదీ కేసీ కెనాల్ దుస్థితి



కర్నూలు రైతుబజార్ ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ ముప్పు

కర్నూలు నగరం తెలియకుండానే ప్లాస్టిక్ మహమ్మారి గుప్పిట్లోకి వెళ్తోంది. ఎవరికి వారు మనకేం కాదులే అనుకోవడం ముప్పును తీసుకొస్తోంది. ప్రతీది ప్లాస్టిక్‌తో ముడిపడి, మనిషి జీవితంలో భాగమైపోవడంతో క్యాన్సర్‌కు దారితీస్తోంది. మట్టిలో కొన్నేళ్ల వరకు కలసిపోని స్వభావం కలిగిన ప్లాస్టిక్ కారణంగా వాతావరణం సైతం వేడెక్కుతోంది. ఎండలు అధికమయ్యాయని నిట్టూర్చే ప్రజలు కనీసం ఇక నుంచైనా ప్లాస్టిక్‌ను వదిలి ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఫొటోలు: డి.హుస్సేన్



జొహరాపురం వద్ద కవర్లను తింటున్న ఎద్దు



జొహరాపురం సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన కేసీ కెనాల్

ఫ్యామిలీ ఫిజీషియన్ పకడ్బందీగా నిర్వహించాలి

కర్నూలు(హాస్పిటల్): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ చెప్పారు. శుక్రవారం ఆయన అమరావతి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో 143 జీఓ ప్రకారం సిబ్బంది ఉండాలని ఆదేశించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలను సందర్శించి రెండు పూటలా వైద్యసేవలు అందించాలని చెప్పారు. వైద్యాధికారులు వారి పరిధిలోని హాస్టల్స్ సందర్శించి విద్యార్థినీ విద్యార్థులకు తగిన ఆరోగ్యసేవలు అందించాలన్నారు. గర్భిణులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత కలిగిన వారికి తగు చికిత్సలు అందించాలని, ఆ వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణులను 12 వారాల్లోపు నమోదు చేసి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో వారికి ఇచ్చిన సేవలను నమోదు చేయాలని, ప్రమాదకర చిహ్నాలుంటే గుర్తించి కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సంబంధిత ఫొటోను ఏఎన్‌ఎం యాప్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే వీలైనంత త్వరగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఎఫ్‌పీసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళీకృష్ణ, కంటి వెలుగు నోడల్ అధికారి డాక్టర్ భరత్, ఏఓ డాక్టర్ నాగప్రసాద్, మలేరియా అధికారి నూకరాజు, ఎస్‌ఓ హేమసుందర్, డీపీఓ విజయరాజు, డెమో శ్రీనివాసులుశెట్టి పాల్గొన్నారు.



జూమ్ సమావేశంలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

రాంగ్‌రూట్‌లో వెళ్తూ మృత్యుఒడికి..

- బైక్‌ను ఢీకొన్న మినీలారీ
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

పాణ్యం: బైక్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదానికి గురైన ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయాలపాలయ్యారు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం చెల్లెల చెలిమిల్ల గ్రామానికి చెందిన బొలు రంగస్వామి (36) మద్యానికి బానిసయ్యాడు. ఈ అలవాటు మానేందుకు పాణ్యంలోని శ్రీ సుంకులాపరమేశ్వరి ఆలయంలో పసరు తాపుతారు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి బొలు శంకర్ కుమారుడిని తీసుకుని పాణ్యంకు వచ్చారు. ఆలయం వద్ద పసరు తాపించుకుని తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. హైవేలో ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మిని లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న రంగస్వామి అక్కడికక్కడే మృతిచెందగా బొలు శంకర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడికి అక్కడే ప్రథమ చికిత్స అందించారు. కళ్లముందే కుమారుడు మృత్యుఒడికి చేరడంతో తండ్రి బోరున విలపించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య గీత, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఐసీడీఎస్‌లో పదోన్నతులకు గ్రహణం!

- కౌన్సెలింగ్ నిర్వహణలో అధికారుల అలసత్వం

కర్నూలు(రాజ్‌విహార్): స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో గ్రేడ్–1 సూపర్‌వైజర్ పదోన్నతులకు పట్టిన గ్రహణం వీడడం లేదు. తగిన సంఖ్యలో ఖాళీలు ఉన్నా.. భర్తీ చేయకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తూ పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకొని అర్హత ఉన్న వాళ్లకు 2012లో రాత పరీక్షల నిర్వహించి గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పించారు. ఇందులో రాయలసీమ జోన్ పరిధిలో 230కి మందికి పైగా అవకాశాలు వరించాయి. అప్పటి నుంచి పనిచేస్తున్న గ్రేడ్–2 సూపర్‌వైజర్లకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది పదోన్నతి కల్పించి గ్రేడ్–1 సూపర్‌వైజర్లుగా నియమించింది. అయితే అప్పట్లో ఉన్న ఖాళీ మేరకు 216 మందికి పైగా పదోన్నతి దక్కింది. ప్రస్తుతం 11 మంది ఏడాది నుంచి పదోన్నతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కౌన్సెలింగ్ మాత్రం నిర్వహించడం లేదు. రెండు నెలల క్రితం ఉన్న ఖాళీల్లో వీళ్లకు పదోన్నతి కల్పించి గ్రేడ్–1 సూపర్‌వైజర్లుగా నియమించాలని నిర్ణయించుకున్న అధికారులు 11 మంది గ్రేడ్–2 సూపర్‌వైజర్ల సర్వీసు రికార్డులు ఆయా ప్రాజెక్టుల నుంచి తెప్పించుకున్నారు. కానీ కౌన్సెలింగ్ నిర్వహించకుండా జాప్యం చేశారు. ఈ లోపు రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేసిన డైరెక్ట్ గ్రేడ్–1 అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్స్ ఇచ్చింది. ఇందులో రాయలసీమ జిల్లాలకు ఆరుగురిని కేటాయించారు. అయితే గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 సూపర్‌వైజర్లుగా పదోన్నతి ఇచ్చే ప్రక్రియ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ఎలాంటి కారణం లేకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని, సకాలంలో కౌన్సెలింగ్ నిర్వహించకపోవడంతో ఏడాది సర్వీసు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత క్లర్కులు సెలవులో ఉన్న కారణంగా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించడంలో జాప్యం జరుగుతోందని, వచ్చే వారం ప్రక్రియ నిర్వహిస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ తెలిపారు.